
ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023 5 విజయనగరం



27 నుంచి కులగణన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 27 నుంచి నగరంలో ప్రారంభం కానున్న కులగణన ప్రక్రియకు ప్రతిఒక్కరూ సహకరించాలని సహాయ కమిషనర్ ప్రసాదరావు కోరారు. స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో బుధవారం కులగణన ప్రక్రియలో నిర్వహించాల్సిన విధివిధానాలపై వాలంటీర్లకు, కార్యదర్శులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా 61 సచివాలయాలకు సంబంధించిన కార్యదర్శులు, వాలంటీర్లకు వేర్వేరుగా వర్క్‌షాప్ నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంటింటికి వెళ్లినప్పుడు సర్వే ఏవిధంగా చేయాలన్న అంశంపై సోదాహరణగా వివరించారు. కార్యక్రమంలో టిపిఆర్‌ఒ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఎవరీ అజ్ఞాతవాసి?

- అధికారులతో సంబంధం లేకుండా ఉపాధి పనులు సమీక్ష
- మొక్కలు ఎక్కువగా పెంచాలంటూ సూచనలు
- చెరువుల్లో నీరు చేరాలంటే ఎలాంటి పనులు చేయాలంటూ ప్రశ్నలు
- డాక్రా రుణాలు, ప్రభుత్వ పథకాలపైనా ఆరా
- నందిగాంలో ప్రత్యక్షమైన లీలావతి అనే మహిళ



తోటలను పరిశీలిస్తున్న అజ్ఞాత మహిళ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/భోగాపురం

ఆమె అధికారి కాదు... ప్రజాప్రతినిధి అంతకన్నా కాదు... ఎన్‌జిఒనా అని ప్రశ్నిస్తే అబ్బబ్బే కాదంటూ ఖండించారు. అధికారులు కూడా తమకు ఎలాంటి సమాచారమూ లేదని చెబుతున్నారు. కానీ, ఆ అజ్ఞాత వ్యక్తి ఉపాధి హామీలో భాగంగా చేపట్టిన అమృత సరోవర చెరువును పరిశీలించారు. చుట్టుపక్కల ఉపాధి హామీ నిధులతో నాటిన తోటలను కూడా చూశారు. అంతటితో ఆగలేదు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి, ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి పనులపై సమీక్షించారు. మొక్కలు ఎక్కువగా పెంచాలంటూ తెగేసి సూచనలు చేశారు. చెరువుల్లో నీరు చేరాలంటే ఎలాంటి పనులు చేయాలంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంకుడు గుంతలు, ఫిష్ పాండ్స్ తవ్వాలని కూడా సూచనలు చేశారు. డ్వాక్రా రుణాలు, ప్రభుత్వ పథకాలపైనా ఆరా తీశారు. భోగాపురం మండలం నందిగాంలో ప్రత్యక్షమైన ఆమె హడావుడిపై జిల్లాలో సర్వత్రా చర్చ నడుస్తోంది. ఇంతకీ ఆమె ఎవరో? అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇదే విషయమై డ్వామా పీడీ ఉమాపరమేశ్వరిని ప్రజాశక్తి వివరణ కోరగా ఫీల్డ్ విజిట్‌కు వస్తున్నట్టు తమకు ఎలాంటి సమాచారమూ లేదని తేల్చిచెప్పారు. అమృత సరోవర చెరువు గురించి ఫోన్‌లో అడిగిన వ్యక్తికి సమాచారం మాత్రమే ఇచ్చానని చెప్పారు. పీడీకి తెలియకుండా ఉపాధి హామీ పనుల పరిశీలన, సూచనలు ఇవ్వడం పట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎవరికీ సంబంధం లేకుండా ఇన్ని వివరాలు సేకరిస్తున్న ఆ మహిళ ఎవరు?. ఇదే విషయమై ఆ మహిళను ప్రజాశక్తి ప్రశ్నించగా 'నా పేరు లీలావతి, నన్ను కమిషనర్ మేడమ్ పంపారు. ఫొటోలు గట్రా తీయవద్దు' అంటూ సమాధానం చెప్పారు. ఇదే నిజమైతే డ్వామా పీడీకి లిఖిత పూర్వక ఆదేశాలు తప్పనిసరిగా అందాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్‌కు కూడా సమాచారం ఉండి తీరే ఉంటుంది. అటువంటిదేమీ లేకపోవడంతో ఆ అజ్ఞాత మహిళ సమాధానం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతున్నట్టు, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితరాలపై వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం జరుగుతున్నట్టు, దాన్ని ఏమాత్రమూ నమ్మవద్దని పిఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్ గత నెల 13న 2783 నంబర్‌తో ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేశారు. తాజాగా తిరిగి కమిషనర్ పంపారంటూ లీలావతి అనే మహిళ చెప్పడంతో ఏదో జరుగుతోందనే అనుమానాలు పెనుభూతాలుగా వ్యక్తమౌతున్నాయి.



సర్పంచ్‌తో మాట్లాడుతున్న అజ్ఞాత మహిళ

25 నుంచి ఇంటింటికీ బిఎల్‌ఒలు

వారం రోజుల్లో 9898 అభ్యంతరాలు • రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సవరణ కోసం ఈ నెల 25 నుంచి డిసెంబర్ 5 వరకు బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి మరోసారి తనిఖీ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. రాజకీయ పక్షాల విజ్ఞప్తి మేరకు మరణించిన వారి ఓట్లను తొలగించడానికి, పొరపాటున తొలగించిన వారిని చేర్పించడానికి బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లాలని తెలిపారు. బుధవారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలెక్టర్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 2, 3 తేదీల్లో బూత్ స్థాయిలో స్పెషల్ కాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 15 నుండి 21 వరకు వారం రోజుల్లో ఫారం-6 చేర్పుల కోసం 3158 , ఫారం-7 తొలగింపుల కోసం 2861, ఫారం-8 సవరణ కోసం 3879 మొత్తం 9898 దరఖాస్తులు అందాయని తెలిపారు. జంక్ క్యారెక్టర్లు 4047 ఉండేవని, అవి 778కు తగ్గాయని చెప్పారు. 18, 19 ఏళ్ల వయసుగల ఓటర్లు తక్కువ సంఖ్యలో ఉండటంతో 17 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్పించేందుకు అన్ని కళాశాలల ప్రిన్సిపల్స్‌తో వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడినట్లు చెప్పారు. వారి నుండి స్పందన బాగుందని, ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చామని వెల్లడించారు. ఇపి రేషియో, జెండర్ రేషియోలపై కూడా దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఓటర్లకు లక్షా 3 వేల ఎపిక్ కార్డులను జనరేట్ చేశామన్నారు. ఇప్పటికే 25 వేల వరకు డిస్పాచ్ చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ అనిత, ఇఆర్‌ఒలు వెంకటేశ్వరరావు, దొర, సుధారాణి, నూకరాజు, వైసిపి ప్రతినిధి రొంగలి పోతన్న, టిడిపి ప్రతినిధి కిమిడి నాగార్జున, ఆప్ ప్రతినిధి దయానిధి, బిజెపి ప్రతినిధి రాజేష్ వర్మ, బిఎస్‌పి ప్రతినిధి సోములు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న టిడిపి నాయకులు కిమిడి నాగార్జున


పారదర్శకంగా ఓటర్ జాబితా తయారుచేయాలి

విజయనగరం కోట : జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమగ్రమైన, పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయాలని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున.. కలెక్టర్ నాగలక్ష్మికి వినతి అందించారు. జిల్లాలో జీరో డోర్ నంబర్‌తో ఉన్న ఓట్లకు సరైన డోర్ నెంబర్ ఇవ్వాలని కోరారు. ఒకే డోర్ నెంబర్‌తో 10 కన్నా ఎక్కువ ఉన్న ఓట్లను సరి చేయాలన్నారు. జిల్లాలో డబుల్ ఎంట్రీలతో ఉన్న ఓట్లను గుర్తించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారిని, మరణించిన వారి ఓట్లను పూర్తి స్థాయిలో తొలగించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఫోర్ట్‌సిటీ విద్యార్థి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఫోర్ట్‌సిటీ పాఠశాల విద్యార్థి పి.రిషి ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇటీవల నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రిషి అండర్-17 విభాగంలో సత్తాచాటాడు. రిషిని ఫోర్ట్‌సిటీ పాఠశాల చైర్మన్ కె.ఎ.పి. రాజు, వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ అభినందించారు.



రిషిని అభినందిస్తున్న ఫోర్ట్‌సిటీ యాజమాన్యం

నేడు డయల్ యువర్ డిపిటిఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో విజయనగరం, శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోల పరిధిలోని ప్రయాణికుల కోసం గురువారం డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఎటువంటి సమస్యలున్నా 9959225604 నంబరుకు ఫోన్ చేసి, నివృత్తి చేసుకోవాలని కోరారు. సమస్యలపై ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో సిసి రహదారి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధిదీపాలు ఏర్పాటుకు తక్షణం చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ధర్మపురిలో రూ.6 లక్షలతో సిసి రోడ్డు ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. నగరంలోని 38వ డివిజన్ గోకపేటలో రౌండ్ టేబుల్ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన పాఠశాల భవన నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ చైర్మన్ దినేష్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్, ఎంఇఒ రాజు, కార్పొరేటర్లు పతివాడ గణపతిరావు, సంధ్యారాణి, జోనల్ ఇన్‌ఛార్జి మారం బాలబ్రహ్మారెడ్డి, వైసిపి నాయకులు నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కుమారుడు ఇందుకూరి సందీప్ వర్మ పదో వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలోని పేర్లవారివీధిలో చెవిటి, మూగ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ స్వీట్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐవిపిరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బొగ్గులదిబ్బ దళితుల ఇళ్ల కోసం

25న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బొగ్గులదిబ్బ దళితుల ఇళ్లు కూల్చేసిన చోట ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈ నెల 25న కార్పొరేషన్ కార్యాలయం ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొగ్గులదిబ్బ దళితుల ఇళ్లు కూల్చేసి 10 నెలలైనా నేటికీ ప్రత్యామ్నాయం చూపలేదన్నారు. గుంకలాం లేఅవుట్‌లో ఇచ్చినవారికి ఇళ్లు నిర్మించలేదన్నారు. నేటికీ అద్దెఇళ్లలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణాల్లో, నగరాల్లో ప్రభుత్వ భూముల్లో నివాసమున్న చోటే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం జిఒ 60 విడుదల చేసిందని, దీన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ధర్నాకు నగరంలో ఉన్న దళితులు, దళిత సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, బొగ్గులదిబ్బ బాధితులు ఎరుకలమ్మ పాల్గొన్నారు.

గౌతమ్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరానికి చెందిన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుడు కళ్యాణం గౌతమ్‌కు వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ ఆర్థిక సాయం అందజేశారు. డిసెంబర్ 8, 9, 10వ తేదీల్లో ముంబైలోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే నేషనల్ ఎమెచ్యూర్ మిక్సిడ్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ లీగ్ (61-65 కేజీల విభాగం)లో గౌతమ్ పాల్గొంటున్నారు. అందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని విక్రమ్ అందించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో గౌతమ్ టైటిల్ విన్నర్‌గా నిలవాలని ఆకాంక్షించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న అవనాపు విక్రమ్

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-వేపాడ

జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. వేపాడ మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రీయ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలైనవని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. వేపాడ మండలం ప్రకృతి వ్యవసాయానికి ఎంతో అనువుగా ఉంది. మండలంలోని సుమారు 13 గ్రామాల్లో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతోంది. సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకు కూరలను మండల కేంద్రంలో ప్రతీ సోమవారం ప్రత్యేక కేంద్రం ద్వారా విక్రయిస్తున్నారు. ఈ శిబిరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆరు రకాల కూరగాయలు, ఆకు కూరలు, ములగ కాడలు, అరటిగెలలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, చిరుధాన్య ఉత్తుత్తులను విక్రయానికి ఉంచారు. మండలంలో సుమారు 20 సెంట్లలో 365 రోజులూ ఆదాయం వచ్చే విధంగా చేస్తున్న ప్రకృతి వ్యవసాయ నమూనాను కలెక్టర్ తిలకించి, ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నిరంతరం ఆదాయం వచ్చే ఎ-గ్రేడ్ మోడల్ విధానంలో ఎకరానికి ఏడాదికి సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం సంపాదించవచ్చునని వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఎపిసిఎన్‌ఎఫ్ జిల్లా మేనేజర్ ఆనందరావు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, సిఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలి

జీవవైవిధ్యాన్ని పెంపొందించడం ద్వారా భూసారాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. ఎస్‌ఎబిఎల్ ప్రాజెక్టులో భాగంగా జీవ వైవిధ్యభరిత వ్యవసాయ విధానాలు, సుస్థిర భూ వనరుల యాజమాన్య కార్యక్రమం గురించి సంబంధిత అధికారులు, రైతులతో మోడల్ మండలంలోని కెజి పూడి గ్రామంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి అశోక్ మాట్లాడుతూ కెజిపూడి పంచాయతీలోని 9 గ్రామాల్లో సుమారు 4250 ఎకరాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, క్షీణిస్తున్న భూములను పునరుద్ధరించడం, ప్రకృతి వ్యవసాయ రైతులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం లక్ష్యాలని తెలిపారు. వ్యక్తిగత, ఉమ్మడి భూములతోపాటు అటవీభూముల్లో కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు, తమ ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయించి, ఎక్కువ ధరకు విక్రయించుకొనేందుకు అవకాశాన్ని కల్పించాలని జెసి సూచించారు. ఆర్‌వైఎస్‌ఎస్ డిపిఎం ఎ.ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, సిఎస్‌ఎ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా యుటిఎఫ్ పోరాటాలు సాగిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి తెలిపారు. బుధవారం యుటిఎఫ్ బొబ్బిలి మండలం నూతన కౌన్సిల్ సమావేశంలో విజయగౌరి మాట్లాడారు. నూతన విద్యావిధానం అమలుతో ఇప్పటికే రాష్ట్ర విద్యారంగం అతలాకుతలం అయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జిపిఎస్ రద్దు చేస్తామని ఎవరు ప్రకటిస్తారో వారికి ఉపాధ్యాయ, ఉద్యోగుల మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులపై అధికారుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల బోధనకు ఆటంకంగా ఉండే చర్యలను జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ తప్పుబట్టారు.

అనంతరం నూతన కౌన్సిల్ ఎన్నికలను జిల్లా కార్యదర్శి కేశవరావు నిర్వహించారు. మండల నూతన అధ్యక్షులుగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా అప్పలనాయుడు, కస్తూరి , కోశాధికారిగా అనంతరావు, సిపిఎస్ కన్వీనర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా ఉపాధ్యాయ ఉద్యమ నేత కామ్రేడ్ శేషగిరికి ఘనంగా నివాళు లర్పించారు.

రేపు వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వీరబ్రహ్మేంద్రస్వామి కాంస్య విగ్రహాన్ని ఈ నెల 24న ఆవిష్కరించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, వైసిపి నాయకులు బొద్దూరు లక్ష్మణరావు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు వరాహాచారి, లక్కోజు అప్పలరాజు, బంగారు దేవుడు, వేముల రాంప్రసాద్, కొండపల్లి అప్పారావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ వితరణ చేశారు. ఆయనకు గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

జామిలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి-జామి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో జామి మండలం జాగారం గ్రామంలో వరి పొలాల్లో బుధవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ప్లాటులో సుమారు 18.680 కిలోల ఉత్పత్తిని నిర్ధారించారు. దీని ప్రకారం ఎకరాకు సగటున సుమారుగా 2,988 కిలోల ఉత్పత్తి నమోదయింది. ఒక్కో బస్తా 75 కిలోల చొప్పున ఎకరాకు సుమారు 39.85 బస్తాల సగటు దిగుబడిగా లెక్కగట్టారు. ఈ ప్రయోగాల్లో జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ముఖ్య ప్రణాళికా శాఖ, వ్యవసాయ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శశిభూషణరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాల డైరెక్టరు మజ్జి శశిభూషణరావు జన్మదిన వేడుకలను ఆ కళాశాలలో, నగరంలో పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. పుర ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలుచోట్ల ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌సిసి అధికారులు మజ్జి వరలక్ష్మి, సత్యవేణి, ప్రశాంత్ అన్నార్తులకు భోజనాలు సరఫరా చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి-విజయనగరం

భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన పోక్సో కేసులో నిందితుడు పోలిపల్లి దుర్గారావుకు ప్రత్యేక పోక్సో న్యాయం స్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు ఎస్‌పి దీపిక తెలిపారు. ఎస్‌పి కథనం ప్రకారం.. 2020 నవంబర్ 25న దుర్గారావు (22) తన ఇంటిపక్కనున్న బాలిక (4)ను ఆటలాడిస్తానని ఇంటికి తీసుకెళ్లి, లైంగిక నేరానికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో దిశ మహిళా పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి దిశ మహిళా పిఎస్ డిఎస్‌పి టి.త్రినాథ్ దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి నిందితుడికి సెక్షన్ 376(ఎబి) ఐపిసి కేసులో 20 ఏళ్లు, పోక్సో యాక్టు కేసులో మరో 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌పి తెలిపారు. నిందితుడు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని, బాధితురాలికి నష్టపరిహారంగా రూ.5లక్షలు అందజేయాలని తీర్పులో వెల్లడించారని చెప్పారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్‌పి దీపిక అభినందించారు.

తారాస్థాయికి సిఎం ప్రచార పిచ్చి : బిజెపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రచార పిచ్చి తారాస్థాయికి చేరిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న క్రీడా క్లబ్‌లకు జగన్ స్పోర్ట్స్ క్లబ్‌లుగా పేరు మార్చడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికే ఎన్‌టిఆర్ యూనివర్సిటీని వైఎస్‌ఆర్ యూనివర్సిటీగా పేరు మార్చి ప్రజల విశ్వాసం కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న వైద్య కళాశాల, ఇఎస్‌ఐ ఆస్పత్రిని తామే నిర్మిస్తున్నట్లు ప్రకటించారని, ఎక్కడా ప్రధాని మోడీ పేరు చెప్పరని అన్నారు.

ఎండియు వాహనాలపై

మోడీ బొమ్మ పెట్టాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రేషన్ పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాలపై ప్రధాని మోడీ బొమ్మ ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షులు పి.నవీన్ కుమార్ ఆధ్వర్యాన బుధవారం కలెక్టర్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్యామ్‌కుమార్, కార్యదర్శి పల్లి రాంబాబు, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిములు విడుదల చేయాలి

వంగర: భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు పోరెడ్డి విశ్వనాథం డిమాండ్ చేశారు. ఈ నెల 25న విజయనగరం మండల కేంద్రంలో జరుగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రెండవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కొనంగిపాడు, జరువాడ, మరువాడ, కింజంగి భాగింపేట తదితర గ్రామాలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికులతో సమావేశాలు నిర్వహించి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. రైల్వే ఫ్లైవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. రోడ్లు, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్లు, కాలువలలో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో పశువైద్య శిబిరం

డెంకాడ: డెంకాడ మండలంలోని ద్వారపూడి గ్రామంలో రాజా సాహెబ్ డాక్టర్ పి.వి.జి రాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎంవిజిఆర్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పశువైద్యశాల వైద్యులు డాక్టర్ భార్గవ్ శిబిరాన్ని సందర్శించి పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఆవులలో పాల ఉత్పత్తిని పెంచడానికి, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంవిజిఆర్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేసింది. గ్రామంలోని వీధి కుక్కలకు వెటర్నరీ డాక్టర్ టీకాలు వేశారు. ఎమ్‌వైఎఫ్‌పి వాలంటీర్లు పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్ తరగతులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల డీన్ ఎస్ మోహన్ కుమార్, పిఒ ఎస్.షణ్ముఖ రావు, కెఏఎస్ఎన్ రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

వేపాడ: స్థానిక పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ భాస్కరరావు బుధవారం సందర్శించారు. పిహెచ్‌సి వైద్యాధికారులు ఎ. ధరణి, కె.రాజు ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గర్భిణుల నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని, డెలివరీలు, ఇమ్యునైజేషన్ లక్ష్యాలు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. ఎఫ్ఆర్ఎస్ విధిగా వేయాలని, పిడిఎఫ్ కాపీలు సక్రమంగా నిర్వహించేటట్లు చూడాలని తెలిపారు.

ఓటు వజ్రాయుధం

బొబ్బిలి: ఓటు వజ్రాయుధమని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని తహశీల్దార్ జోల రాజేశ్వరరావు కోరారు. స్థానిక వాసు జూనియర్ కళాశాలలో బుధవారం ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ప్రభుత్వాలను ఎన్నుకోవాలంటే ఓటు హక్కు పొందాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో కీలకమని వివరించారు. ఓటు నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పోలినాయుడు, వెంకటేష్, పాల్గొన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయండి

బొబ్బిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సున్నపు రమేష్, బొద్దాన శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చేనెల 6న బొబ్బిలి పట్టణంలోని ఎస్‌బిఐ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

స్నేహితునికి పూర్వ విద్యార్థుల సాయం

బొబ్బిలి: స్థానిక సంస్థానం పాఠశాలలో చదువుకున్న 1987-88 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తమతో చదువుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న స్నేహితునికి నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. తమతో పాటు చదువుకున్న పోడింజి శ్రీనివాసరావు ఆర్థిక ఇబ్బందులు పడడంతో రైల్వే లోకో పైలెట్‌గా పని చేస్తున్న జి శ్రీనివాస్ సమకూర్చిన నిత్యావసర సరుకులను రౌతు వాసుదేవరావు, కింతలి బంగారురాజు, లంక వాసు అందజేశారు.

కెజిబివిలో తనిఖీలు

వంగర: స్థానిక కెజిబివి పాఠశాలను జిసిడిఒ పి. మాలతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో డ్రైనేజీ సమస్య ఉందని గుర్తించిన ఆమె ఈ సమస్య ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేసి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ బి రోహిణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరు మండలంలోని వెంకటరమణపేటలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీల్లో బురాడ యోగి, వీరవరపు కార్తీక్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 24 నుండి 26 వరకు ఈస్ట్ గోదావరి జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు, ఉప ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, పొట్నూరు శివాజీ, సబ్బవరపు సతీష్, తమ్మినేని రాజేష్ తదితరులు అభినందించారు.

యోగాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

జామి: మండలంలోని విజినిగిరి యోగా ఆశ్రమంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం బుధవారం జరిగింది. వైద్య శిబిరంలో సుమారు 70 మందిని పరీక్షించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కిలారి సూర్యారావు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, యోగా సాధకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, సహాయ సహకారాలు అందించారు. ఆయుర్వేద వైద్యం వాటి ప్రాముఖ్యతను వైద్యులు వివరిస్తూనే, వైద్యం, మందులు అందజేశారు. అనంతరం వైద్యులకు యోగా సభ్యులు ఘనంగా సత్కరించారు.

వైసిపిలో పలువురు చేరిక

బొబ్బిలి: మున్సిపాలిటీలోని 18వ వార్డుకు చెందిన ఆరు టిడిపి, జనసేన కుటుంబాలు ఆయా పార్టీలను వీడి వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. కోనెటి సూరిబాబు నేతృత్వంలో బూడి ఆనందరావు, బూడి భారతి, బూడి రాజా, బూడి పద్మ, బూడి నర్సింగరావు, బూడి నీలిమ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి శంబంగి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలన నచ్చి చాలా మంది పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళి, పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్, వైస్ చైర్మన్ చెలికాని మురళి, సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు శాఖ ప్రారంభం

భోగాపురం: కెనరా బ్యాంక్ విశాఖ రీజియన్ పరిధిలో 30వ శాఖను భోగాపురంలో బుధవారం ఆ బ్యాంకు విశాఖ రీజియన్ సర్కిల్‌కు చెందిన ఏజిఎం జీవీ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు సులభతరమైన సేవలందించడమే తమ బ్యాంక్ లక్ష్యమన్నారు. మహిళా సంఘాలు, రైతులు, వ్యాపారస్తులు అభివృద్ధికి రుణాలు అందించి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ రీజియన్ ఏజిఎం విజయశ్రీ, డిఎంలు శేషగిరిరావు, సంఘమిత్ర, స్థానిక బ్యాంకు మేనేజర్ జయ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ వికాస్ బ్యాంకులో డిపాజిట్లు పెంచి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖ మేనేజర్ ఆర్.శంకర రావు అన్నారు. బుధవారం జరజాపు పేట ఎపిజిబివి బ్యాంకులో డిపాజిట్లు పెంచడంపై ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు పెట్టినప్పటి నుంచి పాత డిపాజిట్లతో నడుస్తుందని కొత్త డిపాజిట్లు పెంచడానికి అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. డిపాజిట్లు పెంచడం ద్వారా ఖాతాదారులకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సురక్ష భీమా యోజన పథకం, భీమా సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ డి. విక్రం, నగదు అధికారి ఎం. సతీష్ కుమార్, ఖాతాదారు టి. సన్యాసిరావు, బి. వెంకట రమణ, పి. సన్యాసప్పడు, టి.మహేష్, ఎం. సన్యాసిరావు, కె.సత్య సాయిగణేష్, ఎం.సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆయన్ను మరోసారి సిఎంను చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామ సచివాలయం పరిదిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో జగనన్న ప్రభుత్వం అందజేసిన సంక్షేమ ఫలాల లబ్ధి విరాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి వైసిపి జెండాను ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, వైసిపి సీనియర్ నాయకులు దంత లూరి జోగి జగన్నాథ రాజు (గిరిబాబు), మొయిద ఎంపిటిసి పెనుమత్స సంతోష్ బాబు, సచివాలయం పరిధిలో రెండు గ్రామాల సర్పంచులు, వాలంటీర్లు, గృహ సారథులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. **జామి:** మండలంలోని చింతాడ, జట్టేడ వలస గ్రామంలో బుధవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వమించారు. చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సరయు, వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అరుణ, డిసిసిబి డైరెక్టర్ పాండ్రంగి సంజీవి, ఎంపిటిసి నాయుడు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు. **బొండపల్లి:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలందరూ



మెరకముడిదాం: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్

ఆలోచించి మరోసారి ఆశీర్వాదించాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. బుదవారం గరుడబిల్లి గ్రామ సచివాలయ ఆవరణంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఆంధ్రాకు జగనే ఎందుకు కావలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, గొట్లాం పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, ఇఒపిఆర్‌డి సి.హెచ్.సుగుణాకర రావు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **మెరకముడిదాం:** సుమారు రూ.20కోట్లతో అర్హులైన లబ్ది దారులకు సంక్షేమ పథకాలు ఒక్క బైరిపురం గ్రామంలోనే ప్రభుత్వం అందచేసిందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుధవారం బైరిపురంలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా మన రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. వాలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు వంటివి మన గ్రామాలలోనే నెలకొల్పామన్నారు. ఈ సంక్షేమ పథకాలు ఆగకుండా మళ్ళీ రావాలంటే ఆంధ్ర ప్రదేశ్‌కి జగనే మళ్ళీ ముఖ్య మంత్రి కావాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, గ్రామ ఉప సర్పంచ్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పప్పల క్రిష్ణ మూర్తి, పెద్దలు కందుల మల్లి కార్జునరావు, మాజీ డిసి ఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, జెసిఎస్ కన్వీనర్ కెఎస్‌ఆర్కే ప్రసాద్, వైస్ ఎంపిపిలు కందుల పార్వతి, తల చుట్ల హరిబాబు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **భోగాపురం:** ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును ముచ్చటగా మళ్ళీ మూడోసారి గెలిపించుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని రాజాపులోవ సచివాలయం పరిధిలో ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం గ్రామ సర్పంచ్ కిలారి స్వప్న, మాజీ ఎంపిటిసి కిలారి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేసుకున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్, నాయకులు పిడుగు రాంబాబు, సుందర హరీష్ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** మండలంలోని వావిలపాడు గ్రామంలో బుధవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఎగురువేశారు. గ్రామానికి ఈ నాలుగున్నరేళ్లలో ఎన్ని కోట్లు వెచ్చించిందీ ఇంటింటికీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కస్తూరి, వైసిపి మండల అధ్యక్షులు జగన్నాథం, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ రాజేశ్వరి, కోపరేటివ్ అధ్యక్షులు రామమూర్తి నాయుడు, వైసిపి నాయకులు సతీష్, వెంకట్రావు, సన్యాసి నాయుడు, పాటూరు గంగు నాయుడు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండలం పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం తూతూ మంత్రంగా సాగింది. ఈ సందర్భంగా 82 దరఖాస్తులు స్వీకరించారు. బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతిగృహం, కెజిబివి వసతిగృహం, ఎపి ఆదర్శ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి రూపంలో కోరారు. జిల్లా కలెక్టర్ దరఖాస్తు తీసుకుని పరిశీలించి పని చేయండి అని చెప్పడమే తప్ప తప్పుడు సమాచారం ఇచ్చిన ఎంపిడిఒ పట్నాయక్‌పై ఏ విధమైన చర్యలూ తీసుకోకపోవడం ఎస్‌సి, ఎస్‌టి బాలికలంటే ఎంత ప్రేమో ఇట్టే అర్థమైపోతుంది. తప్పు చేసిన అధికారులపై చర్యలు లేకపోతే ఇచ్చిన దరఖాస్తులకు విలువ ఉంటుందా ఫిర్యాదు దారులు విస్తిపోయారు. ఈ స్పందన విభాగానికి వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి, మారిక గిరిజన గ్రామానికి చెందిన వీర్రాజు, తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న వావిలపాడు సర్పంచ్ దంపతులు

డిసిసిబి చైర్మన్ వివి చిన్నరామనాయుడు, దుల్ల సన్యాసిరావు వినతి పత్రాలను ఇచ్చారు. కలెక్టర్ నాగమణి మాట్లాడుతూ స్పందన విభాగంలో వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించి దరఖాస్తులదారులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి అశోక్‌కుమార్, ఆర్‌డిఒ సూర్యకుమారి, జిల్లా పరిషత్ సిఇఒ రాజకుమార్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్ పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి- లక్కవరపుకోట

విజయవాడ వేదికగా దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 27, 28న చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద ఇందుకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు, దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుందన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. పెన్షన్ కమిటీల పేరుతో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేసింది తప్ప కార్మికుల సంక్షేమం కోసం కొంచమైనా పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రజల ఆస్తులు అయిన విద్యుత్, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులు, జాతీయ రహదారులను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తరిణి వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్లు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సిఐటియు నాయకుల పరామర్శ

మండలంలోని గవరవీధిలో ఆదివారం తెల్లవారుజామున వంట గ్యాస్ లీక్ అయి పేలుడు ప్రమాదంలో తామరాపల్లి వెంకటలక్ష్మి , ఆమె కుమార్తె కెల్ల శ్రావణి, మనవడు మనవరాలులు మోహన్, లాస్య, ప్రణవిలు గాయపడి విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరిని మండల సిఐటియు నాయకులు తరిణి వెంకటరమణ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రామబ్రహ్మం, కేశవ ప్రసాదు, రాము, లక్ష్మణరావు, వరహాలరావు తదితరులు బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులను సిఐటియు నాయకులు వెంకటరమణ వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

రాష్ట్రంలో ఉన్న ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఆటో రంగంలో ఉన్న కార్మికులందరినీ గుర్తించేలా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి. సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కోమటిపల్లి ఆటో జంక్షన్ వద్ద శ్రీమజ్జి గౌరమ్మ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు లంక దాలినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు రవాణా రంగంలో కీలకమైన వ్యవస్థగా ప్రజలకు సేవలందిస్తున్న ఆటోరంగంపై అనేక టాక్సీలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రవాణా రంగానికి అతి కీలకమైన రోడ్లకు సరిపడే నిధులు కేటాయించక పోవడం వల్ల ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, తద్వారా వచ్చే ఆదాయంలో ఎక్కువ మొత్తం ఆటో రిపేర్లకే ఖర్చు పెడుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు అదుపు చేయలేకపోవడం వల్ల ఈ రంగంపై ఆధారపడ్డ వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమలు మూత పడటం, ఉపాధి లేకపోవడం వల్ల యువత ఆటోలు నడుపుతూ జీవనోపాధి కొనసాగిస్తున్నారని, ప్రభుత్వం ఇలాంటి వారిని

సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు సూర్యనారాయణ

గుర్తించి అన్ని విధాలుగా వారికి సహాయ సహకారాలు అందించేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంలో తీసుకొస్తున్న మార్పులు, రోడ్డు రవాణా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్న జరగనుందని దీనికి కార్మిక వర్గం అంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి లక్ష్మి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి బర్ల అప్పలనాయుడు, బంగారయ్య, తిరుపతి, మురళి, నాగరాజు, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోడీని గద్దె దించుతాం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలకు పెంచకపోతే రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.శేషగిరిరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు హెచ్చరించారు. ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలుకు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇపిఎఫ్ పెన్షన్ దారులు 75లక్షల మంది ఉన్నారని, ప్రభుత్వం వద్ద పిఎఫ్ సొమ్ము దాచుకుంటే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచకుండా చాలీచాలని పెన్షన్ ఇవ్వడంతో పెన్షన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ రూ.9వేలుకు పెంచాలని, పెన్షనర్స్‌కు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, రైల్వే ఛార్జీలతో రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఓటుతో మోడీకి బుద్ధి చెపుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ సాయిశ్రీకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆల్ పర్సనల్ సంఘం నాయకులు టి.రమణ, డి.రామారావు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్, పెన్షన్ దారులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, పెన్షనర్లు

భూ రీసర్వేలో తప్పుల తడకలు

ప్రజాశక్తి- మెంటాడ

ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన రీసర్వే తప్పుడు తడకలతో కొట్టిమిట్టాడుతుంది. ఈ రీసర్వేలో అధికారుల తీరు అధ్వాన్నంగా తయారైంది. రీ సర్వే వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకరి భూమిని మరొకరి పేరిట రావడంతో అవస్థలు పడుతున్నారు. మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన గొర్లె సన్యాసిరావు 1991లో సర్వేనెంబర్ 106-ఎలో ఎకరం భూమి కొనుగోలు చేశారు. ఆయన పేరుమీద అడంగల్, పట్టాదారు పాసుపుస్తకం కూడా నమోదు చేశారు. అయినప్పటికీ రీసర్వేలో ఎకరా భూమిని రెవెన్యూ అధికారులు 35 సెంట్లకు కుదించారు. రీసర్వేలో తప్పుడు తడకలుగా వున్నవి సరిచేయా ల్సిందే పోయి, పూర్తి హక్కులు వున్నవాటిని తొలగించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఇటువంటి తప్పులే జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో రికార్డు ప్రకారంగా ఉన్న భూమిని తగ్గించి రీ సర్వేలో నమోదు చేస్తున్నారని ఫలితంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పైగా రీ సర్వేలో తప్పులు జరుగుతున్నాయని తహశీల్దార్ రామకృష్ణను రైతు గొర్లె సన్యాసిరావు ప్రశ్నించగా ఇటువంటి తప్పులు జరగడం సహజమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు వాపోతున్నాడు. పైగా తమ భూమిలో సర్వే చేసినపుడు రైతును పిలవకపోవడంతోనే ఇటువంటి తప్పులు జరుగుతున్నా యని రైతులు చెబుతున్నారు. రీ సర్వే చేసిన భూముల్లో ఒన్‌బి, అడంగల్ ఆన్‌లైన్‌లో రాకపోవడంతో బ్యాంకు రుణాలు, రైతుల వడ్డీ మాఫీ వర్తించకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇష్టానుసారంగా రెవెన్యూ అధికారులు పనిచేయ డంతో పాటు రైతుల హక్కులను కాలరాస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే చేసినపుడు సమాచారం లేదు



నేను కొనుగోలు చేసిన భూమిలో సర్వే చేసినపుడు రెవెన్యూ అధికారులు కానీ, సిబ్బంది కానీ నాకు ఎటువంటి సమాచారమూ ఇవ్వలేదు. కాగా నేను రికార్డు పరంగా కొనుగోలు చేసిన భూమిని రీ సర్వేలో తగ్గించి చూపించారు. దీంతో నేను సుమారు 65 సెంట్ల భూమిని నష్టపోతున్నాను. ఈ విషయంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు.

గొర్లె సన్యాసిరావు, రైతు, గుర్ల

పక్కాగా కులగణన సర్వే

ప్రజాశక్తి- బొండపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బిసి కులగణన పక్కగా జరగాలని ఎంపిపి చల్ల చలంనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన బిసి కులగణన సర్వే పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది భాద్యతతో మెలగి ప్రజాప్రతినిధుల సహాకారంతో సర్వేను కచ్చితత్వంతో చేయాలని స్పష్టం చేశారు. తహశీల్దార్ ప్రసాద రావు మాట్లాడుతూ బిసి కులగణనపై ఉన్న అపోహాలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకాల అర్హతకు గాని, ఉన్న పథకాలను తొలగించడానికి గాని ఈ కులగణన వర్తించదనే విషయాన్ని ప్రజలకు స్పష్టం చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. సమావేశంలో టఒటిగా గజపతినగరం ఎంపిడిఒ కొవ్వాడ కిశోర్ కుమార్ వ్యవహరించగా ఎఒ డి.వెంకటరావు, గ్రామ పంచాయతీ కార్యదకర్శులు, విఆర్‌ఒలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వంగర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న కులగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైని గరివిడి ఎంపిడిఒ జి భాస్కరరావు పాల్గొని కులగణన ఏవిధంగా చేపట్టాలనే దానిపైన శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ హనుమంతు శశిభూషణరావు, డిటి బి. సుందరరావు, ఆర్ఐ జామి మురళి, ఇఒపిఆర్‌డి విజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వంగర: మాట్లాడుతున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ

పిఆర్‌సి బకాయి ఇవ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలు ఇవ్వాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక మహారాణి తోటలో బుధవారం రిటైర్డ్ ఉద్యోగుల వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ఇవ్వడం లేదన్నారు. 11వ పిఆర్‌సి ఆడిషనల్ క్వాంటమ్ పాత పద్దతిలో ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డుపై అన్ని వ్యాధులకు వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీలో స్థానం సాధించిన రౌతు రామమూర్తి, ఎల్.జగన్నాథంను పెన్షనర్స్ సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు పి.సత్యంనాయుడు, సత్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

జాగారంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - జామి

మండలంలోని జాగరం గ్రామంలో జాన సన్నిబాబుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్తు షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే మంటలు చెలరేగిన వెంటనే గ్రామ ప్రజలు సచివాల సిబ్బంది వాలంటరీలు మంటలను అదుపు చేశారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఇంట్లో మనుషులు లేని కారణంగా ప్రాణ హాని తప్పినట్లు చెబుతున్నారు. రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించి రూ. 50వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

నదీ పరివాహక ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జిఎస్ రాజశేఖర్ నాయుడు, ఎస్ఐ నారాయణ రావు, నీటిపారుదల సిబ్బంది నెల్లిమర్ల చంపావతి నదీ నీటి పరివాహక ప్రాంతం, పరిసర గ్రామాలలో, విజయనగరంనకు వెళ్లే తాగునీరు బావుల ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. తాగునీటి బావుల వద్ద ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో ఈ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు స్థాయి పడిపోతే తాగునీటి కొరత మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. భూగర్భ జలాలని, తాగునీటిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. **గుర్ల:** మండలంలోని పకీరు కిట్టలి గ్రామ సచివాలయం వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జిఎస్ రాజశేఖర్ నాయుడు, ఎన్.రాజేశ్వరి, డిటిఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు మహిళల వద్ద నుంచి 8 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. సిఐ మాట్లాడుతూ సారా అమ్మకాలు జరిపే వారి పై దాడులు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నెల్లిమర్ల: బావి వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

జంగిల్ డే ప్రదర్శనకు విశేష స్పందన


డైనోసర్ వేషధారణను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్వేతా చలపతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం నిర్వహించిన ది జంగిల్ డే ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. విద్యార్థులు అటవీ ప్రాణుల వేషధారణ ధరించి అడవులు, అటవీ ప్రాణులు వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ప్రదర్శన చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్ అభినందించారు.


వివిధ వేషధారణలో చిన్నారులు